# దీ లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ సత్యప్రకాశం



25

*డా॥ వి. చంద్రశేఖరరావు*



# 1

సత్యప్రకాశం ఫోన్ చేశాడు ఉదయాన్నే. కుడి చెవి, ఒక వేలుతో బిగించి, రిసీవర్ ఎడమచెవి దగ్గరగా పెట్టి, వణుకుతున్న చేతుల్తో ప్రకాశం మాట్లాడే ప్రతి మాటనూ చెవిలో వేసుకోవాలనే తపనతో నాగరత్న.

రిసీవర్ అట్లాగే, చెవి దగ్గర పెట్టుకొని సత్యప్రకాశం, మోనోలాగ్‌లాగా మాట్లాడుతూనే ఉన్నాడు. సత్యప్రకాశ విజయాలు అన తగ్గ విశేషాలు. అవేమీ నాగరత్నకు అర్థంకావటం లేదు. కానీ సత్య ప్రకాశం గొంతును వినడానికి;

ముప్పయి యేళ్ళ నాటి అపార్ట్‌మెంటు. అందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక మూలన, ఒంటరి గది నాగరత్న నివాసం. గది దాదాపు శిథిలమైంది. గోడలు పెచ్చులు ఊడిపోయి, ఫ్లోరింగ్ పగిలి నెర్రలిచ్చి, డెబ్బై ఆరేళ్ళ నాగరత్న, ఒక్కతే ముప్పయి యేళ్ళుగా. ఆ గదిలో, "ఒక్కతివే ఎందుకు? నా దగ్గరకు రా," అంటాడు ప్రకాశం. నాగరత్న ఏం మాట్లాడదు. రెండు విడివిడి జీవితాలు వాళ్ళవి. ఒక తల్లి, ఒక కొడుకు, అంతవరకే, "ముసలి తల్లిని పట్టించుకోవా?" లాంటి నిస్సహాయపు మాటలు మాట్లాడదు నాగరత్న.

నాగరత్న తీరే అంత.

ఎప్పుడూ ఎవరి మీద ఆధారపడలేదు. యుద్ధకాలాల్లో సైనికులు చూపే నిబ్బరం, తెగువ, పోరాటపు చూపు నాగరత్నలో ఇప్పటికీ ఉన్నాయి. ఖమ్మం దగ్గరి పల్లెటూరు వాళ్ళది. కమ్యూనిస్టు కుటుంబం. భర్త చనిపోయిన తరువాత కూడా పార్టీలో కొనసాగింది. నాగరత్న సాహసాల గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు. (చానా యేళ్ళ క్రితం 'మనకు తెలియని మన చరిత్ర', అనే పుస్తకం వచ్చింది.

గొప్ప పోరాట జీవితాల్ని గడిపిన స్త్రీ మూర్తుల కథలవి. నాగరత్న సంగతులన్నీ (ఫొటోతో సహా) ఆ పుస్తకంలో ఉన్నాయి.)

సత్యప్రకాశం సంభాషణ ముగించాడు. నాగరత్నకు అర్థమై నంతలో, సత్యప్రకాశం సినిమా డైరెక్టరుగా చాలా పేరు తెచ్చు కున్నాడు. విదేశాల్లో సన్మానం కూడా జరిగింది. ఈ సంవత్సరమో, వచ్చే సంవత్సరమో పద్మశ్రీ అవార్డు కూడా వస్తుంది. ఇప్పుడు సత్య ప్రకాశం శిష్యులు, అతని జీవితం మీద డాక్యుమెంటరీ సినిమా తీస్తున్నారు. సత్యప్రకాశం సన్నిహితులు, బంధువులు వాళ్ళతో ఇంటర్వ్యూలు తీసుకొని; అందులో భాగంగా. సినిమా వాళ్ళు కెమెరాతో సహా నాగరత్న యింటికి వస్తారు.

నాగరత్న గాఢంగా నిట్టూర్చింది. ప్రకాశం మాటల్లో ఆత్మీ యతో, హృదయపు తడో ఎదురుచూసింది. ఎప్పటిలాగే బిజినెస్ టైపులో.

సత్యప్రకాశాన్ని మానవీయమైన వ్యక్తిలా చూడాలనుకొంది. భగవంతుడికి ఉన్నాయనుకునే విశిష్టతలు, అతనిలో కోరుకుంది. పార్టీ రాజకీయాలను వారసత్వంగా ఇచ్చింది. డెబైల్లో యమ్.ఎల్. రాజకీయాల్లోకి వెళ్ళాడు. నాగరత్న ఆనందించింది. ఆ తరువాత పదేళ్ళలోనే, ప్రకాశం అనార్కిస్ట్ దేవుడిలా మారిపోయాడు. పార్టీ నుంచి బహిష్కరించబడ్డాడు. భార్యను (ప్రేమ వివాహం) వదిలేశాడు. సినిమాలు, డాక్యుమెంటరీలు;

నాగరత్న అతన్ని క్షమించలేదు. తన చుట్టూ సంవత్సరాల నిశ్శబ్దాన్ని నిర్మించుకొంది. ప్రకాశాన్ని గీత అవతలే నిలబెట్టింది. అప్పుడప్పుడు, తన అనార్కిస్టు పొగరు చూపాలనుకుంటాడు ప్రకాశం. నాగరత్న యింటిలో ఫ్రిజ్, ఎ.సి.మిషన్‌లాంటివి తెచ్చి పెడుతుం టాడు. వాటి సీలు కూడా విప్పదు నాగరత్న. ఆర్నెల్లకొకసారి డబ్బు కవర్లని పంపుతాడు. వాటిని ఓల్డ్ ఏజ్ హోంకు విరాళంగా పంపు





తుంది. తనకొచ్చే ఫ్రీడమ్ ఫైటర్స్ పెన్షను, ఎప్పటివో పోస్టల్ డిపాజిట్ల నుంచి వచ్చే వడ్డీ;

మార్చి నెల ఉదయం. పొద్దున్నే నిద్ర లేచి, చాలాసేపు స్నానం చేసి, కాస్త ఉప్మా చేసుకొని తిని, అంతట్లో ప్రకాశం ఫోన్ వచ్చింది. కాసేపు రేడియో విని, సి.ఆర్. ఓల్డ్ ఏజ్ హోమ్‌కు బయలుదేరింది. వారానికొకసారి, అక్కడకు వెళ్ళి, రోజంతా గడిపి వస్తుంది. వీరమ్మ, సంజీవరావు, మనోరమ, సుభద్ర, నాగరత్న స్నేహితులంతా అక్కడే ఉన్నారు. వీరమ్మ, ఆమె హృదయానికి బాగా దగ్గరైన వ్యక్తి.

వీరమ్మ నాలుగు రోజులుగా చెబుతుంది. ఆర్.ఎమ్. పరిస్థితి అంత బాగా లేదని. క్రమంగా జ్ఞాపకశక్తి క్షీణించిపోతుందని. మెస్‌కు రావడం మానేశాడని, గదిలో పెట్టిన టిఫిన్, అన్నం అట్లాగే ఉన్నాయని, నిన్న ఉదయం వీరమ్మను పిలిచి, "నువెవ్వరో నాకు బాగా కావాల్సిన మనిషివి, కానీ నీ పేరే గుర్తు రావడం లేదు," అన్నాడట. డెబ్బై యేళ్ళ ఆర్.ఎమ్. మేధావి, రచయిత, వామపక్ష ఉద్యమాలపై నమ్మకం ఉన్నవాడు. వీరమ్మకు ఆత్మీయుడు. దాదాపు సహచరుల్లా జీవిస్తున్నారు. వీరమ్మ పిల్లలు దూరంగా ఉన్నారు. ఆమెదీ కమ్యూనిస్టు కుటుంబం.

తొమ్మిది గంటలకు ఇంటికి తాళం వేసి బయలుదేరింది నాగరత్న. ఈరోజు అద్భుతంగా గడుస్తుందని, తనకేమీ నమ్మకం లేదు. అమాయకంగా కనబడే ఉదయం, నిప్పులు చెరిగే భీతావహ దృశ్యంగా మారవచ్చు, 'అయినా నేను సిద్ధంగా ఉన్నాను,' అని తనకు తాను సర్ది చెప్పుకుంది.

నాగరత్న భుజానికొక ఖద్దరు సంచి తగిలించుకొనింది. పర్సులో కొద్దిగా చిల్లర, టిఫిన్ బాక్స్‌లో పచ్చికూరగాయలు, వాటర్‌బాటిల్ ఆ సంచిలో వేసుకుంది. నాగరత్న తన సంచిలో చిన్న డైరీని (తన వివరాలుండే) ఒక కత్తిని (ఐదంగుళాల పొడవు) పెట్టుకుంటుంది. కత్తి, తన భద్రతకు అవసరమని నమ్ముతుంది.

రెండేళ్ళ క్రితం, ఒక సాయంకాలం, రైల్వేస్టేషన్ ఎదుట వంద లాదిగా ఉన్న జనం మధ్య తొక్కిసలాటలో, వెనక నుంచి, ఒక పాతికేళ్ళ కుర్రాడు, ఆమె మెడలోని గొలుసును గట్టిగా లాగాడు. గొలుసు వాడి చేతుల్లోకి వెళ్ళే లోపలే, కత్తితో వాడి చేతిపై పొడిచింది. వాడి చేతిపై లోతైన గాయం. రక్తం బుసబుసమని పొంగింది. ''సాలి... చాకుసే మార్‌దియా,'' అంటూ పెద్దగా అరుస్తూ పారిపోయాడు. ఆ సాయంకాలం, ఆ దృశ్యం చూసిన చాలామంది అవాక్కయ్యారు. వణుకుతున్న పిడికిట్లో కత్తిని గట్టిగా పట్టుకొని, వాలిపోతున్న శరీరాన్ని నిటారుగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తూ ఎవరో మంచి నీళ్ళు అందిం చారు. రక్తపు తడి అంటిన కత్తిని, అట్లాగే సంచిలో వేసుకొని, నడుచు కుంటూ వెళ్ళిపోయింది నాగరత్న.

అట్లాంటిదే ఇంకో సంఘటన. రైల్వే ఆఫీసులో ఫ్రీడమ్ ఫైటర్స్ పాస్, రెన్యూవల్ కోసం నెల రోజులుగా తిరుగుతుంది. వాళ్ళు రేపు, ఎల్లుండి అంటూ వాయిదా వేస్తున్నారు. ''ఎన్నాళ్ళు తిప్పుతారు. ఇరవై మైళ్ళ దూరం నుంచి వచ్చాము. మీ తల్లుల తండ్రుల వయసు వాళ్ళం. ఇట్లా ఇబ్బంది పెడతారేమిటి?'' అంది, వాళ్ళతో. ''నస పెట్టమాక. మాకు మీదొక్కటే పనా? అయినా అంతా దొంగ ఫ్రీడమ్ ఫైటర్లే కదా. ఎవడో ఎమ్మెల్లేని పట్టుకొని, దొంగ సర్టిఫికేటు తెచ్చు కొని...'' ఆఫీసు క్లర్క్, అతని మాటలు పూర్తి కాకుండానే, చెంప చెళ్ళుమంది. ఫ్రీడమ్ ఫైటర్స్ ఆఫీసు ముందు ధర్నా చెయ్యటం, అదో ముచ్చటగా చెప్పుకుంటారు, ఇప్పటికీ.

ఉక్కగా, గొడవ గొడవగా ఉంది బస్సు.

వీధులన్నీ మనుషులతో, వాహనాలతో నిండిపోయాయి.

యుద్ధకాలం నాటి తొందర. మహా ఆపద నుంచి పారిపో వలసినట్లుగా, పారిపోతున్నట్లుగా;

ఓల్డ్ ఏజ్ హోమ్‌కు వెళ్ళేసరికి పదకొండు అయ్యింది. ఆర్.ఎమ్. గది నిండా జనం. బంధువులు, స్నేహితులు, వరండాలో





దిగాలుగా కూర్చుంది వీరమ్మ. అంతమంది చుట్టూ ఉన్నా ఆర్.ఎమ్. నిశ్శబ్దం గా, వంటరిగా. ఖాళీగా కూర్చున్నాడు.“మీరెవరు? మిమ్మల్ని ఏమని గుర్తు పెట్టుకోవాలి” అని అందర్నీ అడుగుతున్నాడు. నాగరత్న భుజం పై తలపెట్టుకొని, వీరమ్మ దుఃఖిస్తుంది. అంత ఇష్టంగా, ప్రేమగా, డెభై యేళ్ళ వయసులో. నాగరత్నకు అద్భుతంగా ఉంది. ఉద్యమాలు, మనుషుల్ని మానవీయంగా, ఆత్మీయంగా మార్చుతా యని నాగరత్న నమ్మకం. గుండెల్లో తడి ఉన్న మనుషుల్ని చేస్తుందని అనుకునేది. అయితే తన కొడుకు విషయంలో మాత్రం అట్లా జరగలేదని దిగులు వేసింది. ప్రకాశానికి ఆత్మీయులని చెప్పుకునే వాళ్ళెవరు లేరు. భార్య దూరమైంది. బిడ్డ గురించి అతనెప్పుడూ పట్టించుకోలేదు. మరో మనిషితో కలిసి ఉంటున్నాడని తెలిసింది. ఆమెతోనయినా ప్రేమగా ఉంటాడా, అని నాగరత్న అనుమానం. కీర్తి, డబ్బుపై వ్యామోహం, కృత్రిమత్వం, విలువల్లేని ప్రపంచం, అతన్ని లొంగదీసుకుందేమో, అని అనుకుంది. ఆ కోడలూ అంతే. ఎప్పుడు వెళ్ళినా, బిసుగుకు పోయి ఉంటుంది. ప్రపంచంపై కోపం వచ్చిన దాన్లా ఉంటుంది. ఎప్పుడూ ముఖం మాడ్చుకొని వుంటుంది. మనవ రాలిదొక దుఃఖగాథ. చిన్నవయసులోనే జబ్బుల పాలై, హాస్పటల్ చుట్టూ తిరుగుతుంది. ఇన్నేళ్ళు జీవించినందుకు పశ్చాత్తాపం లేదు గాని, బ్రతకడానికి అవసరమైన ఇంధనం లోపించినట్లుగా అనిపి స్తుంది నాగరత్నకు.

ఓల్డ్ ఏజ్ హోమ్ నుంచి తిరిగి వస్తుంటే, వివరించలేనంత ఒంటరితనాన్ని ఫీలయింది. తన గదికి వచ్చి తలుపులన్నీ బిగించు కొని, సరిగ్గా ఆ సమయంలోనే తలుపుపై పెద్దగా చప్పుడు. బయట మనుషుల అడుగుల చప్పుడు. పెద్దగా వినబడుతున్న మాటలు. తలుపు తీస్తే, అందంగా డ్రస్ వేసుకున్న ముప్పయేళ్ళ మనిషి. ఇంకో అమ్మాయి. కెమరాలు పట్టుకొని ఇంకో ఇద్దరు, వెనుక ఇంకో నలుగు

రైదుగురు. నాగరత్న వాళ్ళ వైపు అయిష్టంగా చూసింది. "ప్రకాశం సార్ మీద డాక్యుమెంటరీ సినిమా తీస్తున్నాము. సినిమాను మీ యింటర్వ్యూతో మొదలుపెట్టాలని మా కోరిక," అన్నాడా కుర్రాడు.

నాగరత్న ఏం మాట్లాడలేదు. వాళ్ళ వైపు నిశ్శబ్దంగా చూస్తూ నిలబడింది. రంగురంగుల బొమ్మలున్న చొక్కా వేసుకున్నాడతను. చొక్కాపై ఎగురుతున్న పక్షులు. సుకుమారంగా ఉన్నాడు తను. పల్చగా పూలకాడల్లా ఉన్నాయతని చేతులు. సన్నగా, పీలగా ఉన్నాడు. కానీ ముఖం, కరుగ్గా ఉంది. అతని కళ్ళలో హంతకుల కళ్ళలో వుండే నిర్భీతి, దయారాహిత్యం కనిపిస్తున్నాయి. "కృష్ణ వంశీకృష్ణ," అని పరిచయం చేసుకున్నాడు. "ఫిలిమ్ డైరెక్షన్‌లో డిప్లొమా తీసుకొన్నాను. సార్ దగ్గర నాలుగు సినిమాలకు అసిస్టెంట్‌గా చేశాను. మాది కృష్ణా జిల్లా. మా గ్రాండ్ పేరెంట్సు కమ్యూనిస్టులే. డాడీ వాళ్ళు అమెరికాలో సెటిల్ అయ్యారు," అన్నాడు. కొంచం కీచుగా, ఆడవాళ్ళ గొంతులా.

ఆ తరువాత నాలుగైదు గంటల పాటు, నాగరత్నను విసిగించారు వాళ్ళు. ముఖ్యంగా ఆమెకు మేకప్ చేస్తామని, డిజైన్ చీర కట్టుకోమని. నాగరత్న తిరస్కరించింది. ఇల్లంతా వాళ్ళకిష్టమైనట్లు సర్దారు. గోడలకు పెయింటింగ్స్ తగిలించారు. ఆమె ముందో మైకు పెట్టి, కెమెరా ఆన్ చేసి, నాగరత్నను మాట్లాడమని అడిగారు. చాలా సేపు మాట పెగల్లేదు నాగరత్నకు.

"అజ్ఞాత స్వర్గం గురించి, మేము కథలు కథలుగా చెప్పుకునే వాళ్ళం. అన్ని కష్టాలు, బాధలు, ఆ స్వప్నలోకంలో అదృశ్యం అయిపోతాయని అనుకునేవాళ్ళం- 'అప్పుడు', 'మనరాజ్యం వచ్చాక', 'ఇవేమీ చెల్లవు', 'దోపిడీలు, దొరతనాలు బందు', 'శ్రామికుల రాజ్యం', 'కష్టజీవుల రాజ్యం' అంటూ నిత్యం కలలు కనేవాళ్ళం. నేను, నా భర్త ఆదినారాయణ, ఊళ్ళో కమ్యూనిస్టులుగా ముద్రపడ్డాం. ఒక విధమైన గర్వం, పొగరు మాకుండేవి. ఆదినారాయణ గొప్ప వక్త.





వ్యాసాలు రాసేవారు. అక్కడ ఆ పోరాటం, ఇక్కడ ఈ పోరాటం అంటూ నిత్యం తిరిగేవాడు. వారాల తరబడి ఇంటికి వచ్చేవాడు కాదు. ఒక్కోసారి జైల్లో ఉన్నాడని కబురు తెలిసేది. చాలా భయం వేసేది...''

నాగరత్న ఒక మూడ్‌లోకి వెళ్ళిపోయింది. టేప్ చేసిన ఆమె మాటల్ని, ఆమెకు వినిపించారు. నాగరత్నకు ఆశ్చర్యం వేసింది. వీంటిని మీటినట్లుండే, తన గొంత ఏమైంది? వంద గొంతుల్లో కూడా స్పష్టంగా వినబడే నాగరత్న గొంతేది? పిడుగుపాటులా, యుద్ధ నాదంలా ఉండే నాగరత్న కేకలు ఏవి? కాలం, తన గొంతులోని తీవ్రతను లాగి వేసుకొని, ముసలిదైన వణుకుతున్న గొంతునిచ్చింది. ఏవేవో దృశ్యాలు కళ్ళముందు మెదిలాయి. గతమంతా వెండితెరలా ధగధగమంటుంది. నాగరత్న కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కంటితడిని వాళ్ళకు కనబడకుండా దాచేసి- ''ప్రకాశం సార్ గురించి చెప్పండి,'' అన్నాడతను.

''ఇప్పుడు కాదు, రేపు రండి,'' అంది, కాఠిన్యమైన ఇనుప ముఖాన్ని ప్రదర్శిస్తూ.

ఆ సాయంకాలం నాగరత్న మరోసారి ఓల్డ్ ఏజ్ హోమ్‌కు వెళ్ళాల్సివచ్చింది. ఆర్.ఎమ్.కు సీరియస్ ఉందని, హాస్పటల్‌లో చేర్చారని వీరమ్మ ఫోన్ చేసింది. కూకట్‌పల్లి దగ్గరిలో ఉందా హాస్పటల్. నాగరత్న వెళ్ళేసరికి, రాత్రి తొమ్మిది దాటింది. బెడ్‌పై ఆర్.ఎమ్. నిద్రపోతున్నాడో, నిస్తేజంగా పడి వున్నాడో తెలియనట్లు, సెలైన్ డ్రిప్. పక్కన శూన్యమైన చూపులతో వీరమ్మ. వీరమ్మ ఏం మాట్లాడటం లేదు. సమస్తం కోల్పోయినప్పటి దైన్యం ఆమె ముఖంలో. నాగరత్నకు ఇంకా ఆశ్చర్యం. మనుషుల మధ్య ఇష్టాలు, స్నేహాలు ఇంత గాఢంగా ఉంటాయా? ఆర్.ఎమ్. భార్య, పిల్లలు కూడా (భార్య లేదు. పిల్లలు అమెరికాలో ఉన్నారు) ఇంతగా వ్యథ చెంది ఉండరు. వీరమ్మ,

భుజాలపై చెయ్యి వేసి, ఆమె తలను తన గుండెలకు హత్తుకొని, వీపు నిమురుతూ. ఆర్.ఎమ్. బెడ్ పక్కనే కూర్చున్నారు వాళ్ళు. మూడు గంటల సమయంలో కాస్త కునుకుపట్టి, నిద్రలోకి జారుకుంది. వీరమ్మ ఏడుపుతో ఉలిక్కిపడి లేచింది. ఆర్.ఎమ్. బెడ్ చుట్టూ డాక్టరు, నర్సులు.

ఆర్.ఎమ్. ముఖం ప్రశాంతంగా ఉంది. ఎప్పటిలాగా తన ముఖం దయాపూరితంగా ఉంది. ప్రేమ పూర్వకమైన పలకరింపు లాంటి ముఖం. ముఖంలో కదలికలు లేవు. శ్వాస ఆగిపోయింది. చనిపోవటం అంటే ఇంతేనా అనుకుంది నాగరత్న. వీరమ్మ పొగిలి పొగిలి ఏడుస్తుంది. ఎట్లా ఓదార్చాలో తెలియటం లేదు. డాక్టరు, నర్సు వెళ్ళిపోయారు. వీరమ్మ ఆర్.ఎమ్. పక్కనే కూర్చుంది. నిర్జీవమైన అతని చేతిని, తన చేతిలోకి తీసుకొని, అతని ముఖంలోకి చూస్తూ, అతనితో సంభాషిస్తున్నట్లుగా తెల్లవారే దాకా. అదే భంగిమలో కూర్చుంది. స్వగతంలాగా, జ్ఞాపకాలెన్నిటినో చెబుతుంది వీరమ్మ. ముప్పయి యేళ్ళకే భర్త చనిపోయాడు. పెద్ద కొడుకు, పాతికేళ్ళ వయసులో, ఉద్యమం అంటూ వెళ్ళిపోయాడు. ఆ తరువాత పదిహేనేళ్ళ తరువాత, ఎన్‌కౌంటర్ చెయ్యబడ్డ అతని శవాన్ని మాత్రమే చూసింది. చిన్నకొడుకు పిరికివాడు. నక్సలైట్ నాయకుడి తమ్ముడని ముద్ర పడుతుందని భయపడ్డాడు. భార్యాపిల్లలతో ఎటో వెళ్ళిపోయాడు. పాతికేళ్ళయింది. ఇప్పటికీ వాళ్ళ ఆచూకీ తెలియదు. వీరమ్మ ఎంతో నిబ్బరమైన మనిషి. దేనికీ భయపడే మనిషి కాదు. కానీ ఈ వేళ, తన స్నేహితుని మరణం ముందు, దీనంగా, వియోగాన్ని తట్టుకోలేనట్టుగా దుఃఖిస్తుంది. వీరమ్మ ఒక విధమైన ఉద్వేగానికి లోనయింది. మృతవీరుల సంస్మరణల్లో పాడే పాటలు గుర్తు తెచ్చుకొని పాడటం మొదలుపెట్టింది. తెల్లవారే దాకా, అట్లా పాడుతూనో, మాట్లాడుతూనే ఉంది. ఉదయం కావస్తుంది. బయట పక్షుల





అరుపులు వినిపిస్తున్నాయి. సిటీ మేలుకున్నట్లుగా ఉంది. అలసి పోయిన వీరమ్మ, ఆర్.ఎమ్. పక్కనే తలపెట్టుకొని నిద్రపోయింది.

నాగరత్న, వీరమ్మను బలవంతంగా లేపి, ముఖం కడిగించి బయటకు లాక్కువచ్చింది. కాంటీన్‌లో కాఫీ తాగి వచ్చేసరికి, ఓల్డ్ ఏజ్ హోమ్ నుంచి మనుషులు వచ్చారు. పత్రికల వాళ్ళు, ఫొటోలు, ఇంటర్వ్యూలు- నాగరత్న, మెల్లగా అక్కడ నుంచి వచ్చేసింది. ఖాళీ తనం ఏదో ఆ రోజంతా ఆమెను వెంటాడుతూనే ఉంది.

కృష్ణ అనే మనిషి, మరుసటి రోజు పదిగంటలకే వచ్చాడు- కెమెరాలు, ఫ్లాష్‌లు, మేకప్ మనుషులు 'ప్రకాశం సార్ గురించి చెప్పండి... సార్ బాల్యం, స్కూల్ డేస్..." నాగరత్న ముఖంలో విసుగు, అనుమానం.

"వరదలు, వర్షాలు, సమస్తం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు ప్రకాశం పుట్టాడు. వాడు పుట్టినప్పుడు వాళ్ళ నాన్న ముఖంలో ఎంతో ఆనందం కనిపించింది. అప్పుడే పుట్టిన బిడ్డ పక్కన కూర్చుని, వాడి చెవుల దగ్గర "కామ్రేడ్ సత్యప్రకాశం, హౌ ఆర్ యు" అని పలుకరించాడు. అందరూ పిల్లల్లా వాడు ఏడ్చేవాడు కాదు. "శిశువు రూపంలో వున్న లెనిన్," అని ఉద్రేకపడ్డాడు వాళ్ళ నాన్న. ఆయన కవిత్వం రాసేవాడు. పిల్లవాడిని ఉద్దేశిస్తూ, రేపటి కమ్యూనిస్టు రాజ్యంలో, వాడు ఎలా ఎదుగుతాడో వివరిస్తూ, ఒక కవితను రాశాడు. కరపత్రంగా ప్రచురించి, మిత్రులందరికీ పంచాడు.

"ప్రకాశానికి ఆరునెలల వయసులో సాయుధపోరాటం మొదలైంది. ఆదినారాయణ అదృశ్యం అయ్యేడు. తరువాత నన్ను రమ్మని కబురు చేశాడు. రహస్య ప్రదేశాల్లో, మారుమూల గుడిసెల్లో వాడి బాల్యం, పల్లె దుఃఖాలు, వాడు విన్నాడు. రహస్య సమాలోచనలు, బుల్లెట్ గాయాలతో పెనుకేకలు వెయ్యటం, అర్ధరాత్రి

మనుషుల నుంచి జీవపు ఆనవాళ్ళు ఆగిపోవటం వాడు చూశాడు. వాణ్ణి 'మన హీరో' మన 'రేపటి ఆశ' అని అందరూ ముద్దు చేసే వాళ్ళు.

"ఆదినారాయణ గురించి కబుర్లు తెలుస్తూనే ఉన్నాయి. పలాని చోట, పలాని పోరాటంలో, అని కబురు తెచ్చేవాళ్ళు.

"ఒక వర్షపు రాత్రి ఆదినారాయణ మరణవార్త తెలిసింది. పెద్దగా ఏడ్వాలని, గుండెలు బాదుకోని, కానీ అది కమ్యూనిస్టు క్రమ శిక్షణకు వ్యతిరేకమని;

"కొరియర్‌గా పని చెయ్యమని ఆదేశాలు వచ్చాయి. అప్పటికి ప్రకాశం వయసు ఏడేళ్ళు."

హఠాత్తుగా నాగరత్న మాట్లాడటం ఆపేసింది. కెమెరాలను ఆపివేయమంది. చీరకు తగిలించిన మైకను తీసి పక్కన పెట్టింది. తన పాత సూట్‌కేసును బయటకు తెచ్చి, అందులోని వస్తువులన్నీ బల్లపై గుమ్మరించింది. ప్రకాశంచిన్ననాటి ఫొటోలు, అతని పుస్తకాలు, ప్రకాశం చిన్నతనంలో రాసిన కవిత్వాలు, న్యూస్‌పేపర్ కటింగ్స్. స్కూల్లో, కాలేజీల్లో, స్టేజీపై ఉపన్యసిస్తూ, నాటకంలో వేషం వేస్తూ, వందలాది ప్రకాశాలు, బల్లపై చెల్లాచెదురుగా పడి;

వాటిపై కెమెరా ఫోకస్ చేసి, ఒక్కో ఫొటోనే రికార్డు చేస్తూ;

అదంతా, తనకు చెందని, తనది కాని, ఆస్తి అన్నట్లుగా చూస్తుంది నాగరత్న. ఎంతో అపురూపంగా దాచుకొన్ని ఆ ఫొటోల్నీ, వస్తువుల్ని మరింక చూడాలనిపించలేదు. విరక్తిలాంటి భావం. ఆ మొత్తం జ్ఞాపకాల్ని తనలోంచి తీసి వెయ్యాలనిపించింది. "అవన్నీ తీసుకొని వెళ్ళండి" అంది గంభీరంగా.

అతను ఏదో చెప్పబోతుండగా "ప్రకాశం గురించి చెప్పవల సిందేమీ లేదు. వెళ్ళండి. మళ్ళీ రావద్దు," అంది కఠినమైన గొంతుతో.

తన గొంతులోని కాఠిన్యానికి తనే ఆశ్చర్యపోతున్నట్లుగా.





## 2

ఒక్కొక్క జ్ఞాపకపు పొర విప్పుతూ. ఫ్లాష్ బ్యాక్ లాంటి ఒక ప్రయాణంలో, సత్యప్రకాశం, జాడల కోసం వెతుకుతూ, సాయం కాలం నాలుగు సమయంలో  మినర్వా కాఫీ హౌస్‌కు బయలు దేరింది మాలతి. అతనంటే ఏమిటి? ఇన్నేళ్ళ తరువాత ఆమె తనను తాను ప్రశ్నించుకొంది. విస్మయంతో, ఆరాధనతో అతని వైపు చూసిన రోజులున్నాయి. జుగుప్సతో, అసహనంతో అతని ఉనికిని దూరంగా విసిరేసిన సందర్భాలున్నాయి. కామ్రేడ్ సత్యప్రకాశం, యోధుడు, కవి, ఉద్యమాల్ని రచించినవాడు, కొన్ని సంవత్సరాల క్రితం నాటి, ఒక చరిత్రకు మొదలు, ముగింపు తానే అయినవాడు. తన చెల్లెలి భర్త, ఇప్పుడు మరెవరో స్త్రీతో కలిసి జీవిస్తున్నవాడు. ఇన్నేళ్ళ తరువాత ప్రకాశం, ''నిన్ను చూడాలి, కాసేపు నీతో గడపాలి. నా శిష్యులు కొంత మంది నాపై డాక్యుమెంటరీ సినిమా తీస్తున్నారు. దానిలో భాగంగా నీతో ఇంటర్వ్యూ చేస్తానంటున్నారు. అది ఒట్టి నెపం మాత్రమే. నీతో మాట్లాడాలి. అది ముఖ్యం,'' అంటూ ఫోను చేశాడు.

గత పది, పదిహేనేళ్ళుగా సత్యప్రకాశం, ఫిలిం డైరెక్టర్‌గానే ప్రపంచానికి తెలుసు. నాలుగో ఐదో సినిమాలు, ఎక్కువగా ఫిలిం ఫెస్టివల్స్‌లోనే ప్రదర్శించబడతాయి. అతని డాక్యుమెంటరీ సినిమా లకు అవార్డులు కూడా వచ్చాయి.

''నన్నూ ఎవరితోనో అడిగించారు. గో టు హెల్,'' అని తిట్టాను అంది కరుణ, చెల్లి. ''అదూర్ గోపాలకృష్ణన్ 'ముఖాముఖం' సినిమాలోని ప్రొటోగనిస్టులాంటి వాడు ఇతను. అవకాశవాది, ది బ్లడీ సక్కర్, నువ్వు వెళ్ళవద్దు,'' అంది కరుణ.

''అతనా, నాకు అతన్నోసారి చూడాలని ఉంది,'' అంది ప్రకాశం, పద్దెనిమిదేళ్ళ కూతురు వీర, తల్లి దగ్గరే ఉంటుంది.

మినర్వా కాఫీహౌస్ ఖాళీగా ఉంది. షూటింగ్ కోసం, రెస్టా రెంట్ మూసివేశారు. కిటికీ పక్కన, ఆమె ఫేవరెట్ ప్లేస్. నేరుగా వెళ్ళి

అక్కడ కూర్చుంది. 'వంశీకృష్ణ' అనేవాడు, తానే డైరెక్టర్ అని పరిచయం చేసుకున్నాడు. పదిమంది దాకా ఫిలిం క్రూ. ప్రకాశం ఇంకా రాలేదు.

మూలన కూర్చున్న టేబుల్ పక్కన కిటికీకి అవతల, ఒకప్పుడు బోగన్ విల్లియా పొద ఉండేది. ఎర్రటిపూలు కిటికీలోకి ముఖాన్ని పెట్టి చూసేవి. మాలతికి ఆ ప్రదేశమంటే ఎంతో యిష్టం. ఇప్పుడా పూలపొద లేదు. కొట్టేశారు. కిటికీకి గాజు అద్దాన్ని బిగించి, ఇప్పుడా అద్దాల్లోంచి రోడ్డు, రోడ్డు పై యుద్ధభూముల నుంచి క్షతగాత్రులై వస్తున్న వాళ్ళలా జనం నిర్లిప్తంగా ఆ రోడ్డు వైపు చూడ్డం అలవాటు చేసుకుంది మాలతి.

అప్పట్లో, ప్రకాశంతో కలిసి, ఆ హోటల్‌కు చాలాసార్లు వచ్చింది. 'ది మార్చ్' అనే బులిటెన్ తీసుకువస్తుండేవాళ్ళు అప్పుడు. ప్రూఫ్ రీడింగ్ ఇక్కడ కూర్చునే చేసేవారు. మాలతి, తను కొత్తగా నేర్చుకొన్న పాటలు (పోరాట గీతాలు) అతని ముందు ప్రదర్శించి, అతను ఏదైనా మాట్లాడి, మెచ్చుకుంటే బాగుండు అనుకునే రోజులు. గుబురు గడ్డం, దువ్వని జుట్టు నిర్లక్ష్యంగా నుదిటిపై ఎగురుతూ, కోడిగుడ్డు ఆకారంలో వింతగా ఉండే కళ్ళజోడు, అతని చేతిలో ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం ఉండేది. విద్యార్థి సంఘం స్టేట్ సెక్రటరీగా ఉండేవాడు. అప్పట్లో, అతనంటే ఇష్టమూ, ఎడ్మిరేషనూ ఉండేవి. అయితే ఇట్లాంటి ఆకర్షణలు, ఇష్టాలు ముఖ్యమైనవి కావని నమ్మే రోజులవి. కృష్ణాజిల్లాలోని, ఒక కమ్యూనిస్టు గ్రామం నుంచి వచ్చిన మాలతి, హైస్కూలు రోజుల్లోనే కమ్యూనిస్టు కార్యకర్తగా ఉండేది. యమ్.ఎల్. రాజకీయాల్లోకి రావటం అత్యంత సహజంగా జరిగి పోయింది. గుంటూరు పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన ఒక రాష్ట్ర సదస్సులో మొదటిసారి చూసింది ప్రకాశాన్ని. కార్యకర్తల రివ్యూ మీటింగ్‌లో, మాలతిపై విరుచుకుపడ్డాడు. నాయకత్వ లక్షణాలు బొత్తిగా లేవని





పెదవి విరిచాడు. మొదటి పరిచయంలోనే అహంకారి, మొరటు అని తీర్మానించుకుంది. అయితే ఆ అభిప్రాయం ఎంతోకాలం నిలవ లేదు. అతని ఉపన్యాసం ఉర్రూతలూగించేది. అప్పటికప్పుడు, ఒక స్ట్రీట్ ప్లే రాసుకొని, ప్రదర్శించి, వీధుల్ని సమ్మోహితం చేసేవాడు. ఆ మనిషిని ఎక్కువకాలం ద్వేషించలేకపోయింది. ఇంటికి ఆహ్వా నించి, తల్లికి, చెల్లికి పరిచయం చేసింది. అతనంటే యిష్టమా, అనుకుంటే, ఊ అనుకునేది. లలిత లలితంగా, ఒక మోహగానం, ఆమెలో పల్లవిస్తూ ఉండేది.

ఇంటికి తీసుకెళ్ళిన ఆరునెలలలోనే, తన చెల్లెలు కరుణతో అతని పెళ్ళి జరిగింది. కరుణ రాజకీయ వాసనలేవీ లేకుండా పెరిగింది. ముగ్ధ. ప్రకాశం అంటే హీరో వర్షిప్.

సరిగ్గా సంవత్సరం క్రితం, జనవరి నెలలో, ఒకసారి ఫోన్ చేశాడు ప్రకాశం (దాదాపు పదిహేనేళ్ళ తరువాత) "పొలిటికల్ ప్రిజనర్స్ పై డాక్యుమెంటరీ తీస్తున్నాను. చంచల్‌గూడ జైలు దగ్గర ఉన్నాను. రాగలవా," అంటూ ఫోన్ చేశాడు. మాలతి, విని ఊరుకుంది. ప్రకాశం ఫోన్ చేసే సమయానికి ఆమె, సదస్సులో ఉంది. "గృహహింస-దళితస్త్రీలు" అనే సదస్సు. తన ఎన్.జి.వో. సంస్థ (స్త్రీ సంఘటన) తరఫునే ఏర్పాటు చేసింది. వెళ్ళగలిగే పరిస్థితి కాదు.

రాత్రి ఎనిమిదింటికి, ఇంటికి చేరాక, డ్రాయింగ్ రూమ్‌లో ఆ మనిషి ప్రత్యక్షమయ్యాడు. గదంతా సిగిరెట్టు పొగ. "రాకోయి అనుకోని అతిథి," అంటూ రాగయుక్తంగా మాలతిని పలకరించాడు. వంట చేస్తూ వింత ఉద్వేగానికి లోనయింది మాలతి. చికెన్ కర్రీ, ఫ్రైడ్ రైస్, ప్రకాశం కోసం ప్రత్యేకమైన అతిథ్యం. రాత్రి పదకొండు గంటల దాకా ప్రకాశం కబుర్లు చెబుతూనే ఉన్నాడు. మాలతి మౌనం గా వింటుంది. "ముసలితనం నిన్ను అంటలేదు. యూ ఆర్ స్టిల్ ఎట్రాక్టివ్," అన్నాడు మిచ్చీవస్‌గా నవ్వుతూ. మాలతి గంభీరంగా

అతని వైపు చూసింది. తన గదికి వెళ్ళినాక ''గెటౌట్'' అని ఎందుకు అనలేకపోయాను, అని ఆలోచిస్తూ నిద్రపోయింది.

అర్ధరాత్రి మూడు గంటలకు, పీడకల వచ్చి మెలకువ వచ్చింది. బయట ఎక్కడో కుక్కల అరుపులు. ప్రకాశం గదిలో లైటు వెలుగుతుంది. కిందకు వెళ్ళింది. ప్రకాశం గదిలో లేడు. బయట తలుపు తీసే ఉంది. దూరంగా స్ట్రీట్ లైటు వెలుతురులో, పేవ్‌మెంట్ పై పడిపోయిన ప్రకాశం. ప్రకాశం శరీరం రక్తసిక్తమై, మూలుగుతూ, పక్కనే పగిలిన విస్కీ బాటిల్. రక్తం, విస్కీ, కొద్దిగా జబ్బు వాసన వేస్తున్న ఆ మనిషిని ఇంటి వరకూ లాక్కువచ్చి; ''మగ్గింగ్, నాలుక ఎండిపోయి, విస్కీ తెచ్చుకుందామని వైన్‌షాపు దాకా వెళ్ళి, అక్కడ కుర్రవాళ్ళతో గొడవపడ్డాను. అక్కడో యంగ్ బ్యూటీఫుల్ గర్ల్‌కు, సివిల్ రైట్సు గురించి లెక్చరిస్తుండగా, నా పై విరుచుకుపడ్డారు- ఆ అమ్మాయి బాయ్‌ఫ్రెండ్, మరి కొద్దిమంది కుర్రాళ్ళు. చితకబాది రోడ్డుపై పడేశారు.'' హాస్పిటల్‌లో చేర్చి, రెండు రోజుల పాటు అతనికి సేవలు చేయాల్సి వచ్చింది. ఆ తరువాత వారం రోజులు, మాలతి ఇంట్లోనే ఉన్నాడతను. కృతకమైన ఒక చనువు ప్రదర్శించటము, మాలతికి తెలుస్తుంది. ఒకరోజు రెస్టారెంటుకు వెళ్దామని ప్రపోజ్ చేశాడు. కుదరదని చెప్పింది.

''నీ జ్ఞాపకాలు, నాలో ఇంకా ఫ్రెష్‌గా ఫ్రాగ్‌రెంటుగా ఉన్నాయి,'' అన్నాడొకసారి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ. మాలతి నిర్లిప్తమైన, పేలవమైన నవ్వు నవ్వింది.''లైఫ్ పార్టనర్ లేకుండా, సింగిల్‌గా ఎందుకిలా,'' అని ఇంకోసారి. మౌనంగా వినేది, 'నీ మంత్రవిద్యలు నాకు తెలియనివా' అన్నట్లుగా, ఒక మార్మికమైన నవ్వు నవ్వేది.

ప్రకాశం వచ్చిన సంగతి కరుణకు చెప్పలేదు. ప్రకాశం గురించిన ఏ ఆసక్తీ లేదు కరుణకు. ఉద్వేగాలన్నీ వలిచేసుకొని మర





మనిషిలా మారింది. అబిడ్స్‌లో కరుణకి ఒక బోటిక్ షాపు ఉంది. ప్రింటెడ్ శారీస్, కొత్త డిజైన్స్, ఇవి తప్ప ఇంకేమీ మాట్లాడదు కరుణ. అనుబంధాలు, స్నేహాలు వగైరాల సెంటిమెంట్లు, తనకు లేనట్లుగా ఉంటుంది. మాలతి నడిపే ఉద్యమాలు, ఎన్‌జివోలు, వేటితోనూ సంబంధం లేనట్లుగా ఉంటుంది. అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ పెద్దగా కలుసుకోరు. కలుసుకొన్న కొద్దిసేపూ, కరుణ షాపు గురించే మాట్లాడు తుంది.

పదేళ్ళ క్రితం, ప్రకాశం నుంచి విడిపోయిన కొత్తలో పాపతో సహా, మాలతి ఇంటికి వచ్చింది. ఒక అర్ధరాత్రి, వీరను జాగ్రత్తగా చూసుకొమ్మని ఉత్తరం రాసి, ఇంట్లోంచి బయటకు వచ్చింది. అర్ధ రాత్రి, ఒంటరిగా, సిటీ వీధుల్లో నడుచుకుంటూ. నిశ్శబ్దపు వీధులు. హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ఆమె ఆలోచన. ఈ లోపల ఎవరైనా ఆమెను ఆపి దాడిచేసి, చంపి, అట్లయినా పరవా లేదనుకుంది. చాలా దూరం నడిచాక, ఒక బస్టాపులో కూర్చుని, ఏవేవో గుర్తుకు తెచ్చుకొని చాలాసేపు ఏడ్చింది. వేకువజాము మూడు గంటల సమయమది. వీధులు ఊడ్చే ఆడవాళ్ళు అటువైపుకు వచ్చారు. బస్‌స్టాప్ పక్కనే కూలబడ్డారు. పొగు చేసిన కాగితాలతో చిన్న మంట వేసుకున్నారు. మంట చుట్టూ మూగి, పెద్దపెద్దగా కబుర్లు చెప్పుకుంటూ, కలలోలాగా. ఎక్కడినుంచో టీ కుర్రాడు వచ్చాడు. ప్లాస్టిక్ గ్లాసుల్లో టీ అందించాడు. వాళ్ళలోంచి ఒక ముసలమ్మ, టీ గ్లాసు తెచ్చి కరుణకు ఇచ్చింది. టీ తాగినాక కరుణను మంట దగ్గరకు ఆహ్వానించింది. ఆ ముసలమ్మ, కరుణ భుజం చుట్టూ చెయ్యివేసి దగ్గరకు లాక్కుంది. చిన్నపాపాయి లాగా ఆమెను కరుచుకొని పెద్దగా ఏడ్చింది కరుణ. తెల్లవారి, ఆరుదాకా వాళ్ళతో గడిపింది. పొద్దున్న ఏడింటికి ఇంటికి వచ్చింది. మాలతి ఏం మాట్లాడలేదు. ఆమె ముఖంలో ఎట్లాంటి ఫీలింగ్ లేదు. ఆ తర్వాత రెండు రోజులకు

“నాకిట్లాంటి వేషాలు నచ్చవు. పిరికివాళ్ళంటే నాకసహ్యం,” అంది. “దుఃఖాన్ని ఎంజాయ్ చెయ్యటం మానివేసి, మామూలు జీవితంలోకి రా. కాన్వెంటులో జాబ్ చూశాను. రేపట్నుంచి వెళ్ళు. ట్రై టు బి నార్మల్,” అని సీరియస్‌గా క్లాసు తీసుకొంది. ఆ మరుసటి రోజే మాలతి ఇంటిలోంచి వచ్చేసింది కరుణ. గది, అద్దెకు తీసుకొని, షాపులో సేల్స్‌గరల్‌గా చేరి, కరుణకు ఇప్పుడు దుఃఖం రాదు. పెద్దగా సంతోషమూ కలుగదు. ఉద్వేగాలన్నీ అదృశ్యం అయినదాన్లా;

ఆరేడు నెలల క్రితం సత్యప్రకాశం కొత్త సినిమా ప్రివ్యూకు ఆహ్వానం అందింది, మాలతికి. ప్రివ్యూకి వెళ్ళలేదుగానీ, నాలుగైదు రోజుల తరువాత ఆ సినిమాను థియేటర్లో చూసింది. రివ్యూలో రాసినంత గొప్పగా లేదు. సినిమా అంతా సెపియా రంగులో తీశాడు. ముప్పయి యేళ్ళ నాటి కథలు. భూపోరాటాల నేపథ్యంలో, నాలుగు పాత్రల విడివిడి కథలవి. ఒక పాత్రలోంచి ఇంకో పాత్రలోకి. పొలిటికల్ సినిమాగా పేరు వచ్చింది. థియేటర్లలో వారమే ఆడినా, చాలా ఫిలిమ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడింది. ఒకటో రెండో అవార్డులు వచ్చాయి. అదృశ్యమైన ఒక చారిత్రక స్వప్నంలోకి ప్రయాణం ఆ సినిమా. ఉద్వేగాల్ని చెదరగొట్టి, ఒక నాస్టాల్జియాలోకి ప్రవేశపెట్టింది ఆ సినిమా. ఆ సినిమాలోని స్త్రీ పాత్రకు కొద్దిగా మాలతి పోలికలు ఉన్నాయి. మాలతి కథే. సినిమా చివర్లో ఆ పాత్ర చనిపోతుంది. భూపోరాటాల్ని అతడు చిత్రించిన తీరు బాగుంది, చరిత్రను రికార్డు చేసినట్లుగా. నిజానికా సినిమా సత్యప్రకాశం, పొలిటికల్ ఆత్మకథలాంటిది. విద్యార్థి రాజకీయాల్లోంచి క్షేత్ర రాజకీయాల్లోకి వెళ్ళడం, తానే ఒక భూ పోరాటాన్ని నిర్మించటం, పార్టీ నుంచి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నాడని బహిష్కరించిన సంఘటన కూడా ఉంది. ఆశ్చర్యంగా, సినిమాలో ప్రకాశం, తనను తాను డిఫెండ్ చేసుకోలేదు. ఉద్యమంలో అస్తిత్వవాదం అవసరమని, వ్యక్తిగత అస్తిత్వాలను పరిగణలోకి





తీసుకోవాలని, ఒక సిద్ధాంతాన్ని, ఆ సినిమా చివర్లో ప్రతిపాదించాడు ప్రకాశం.

ఈ రోజు ఉదయం, సత్యప్రకాశం ఫోన్ చేసే, సమయానికి, అతని గురించే ఆలోచిస్తుంది మాలతి. ముప్పయి యేళ్ళనాటి ప్రకాశం ఎలా ఉండేవాడో, గుర్తు చేసుకుంది. అయాస్కాంతంలా ఆకర్షించే వ్యక్తి. నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా, శక్తి మండలంలా ఉండేవాడు. ఎవరితోనూ మృదువుగా, మంచిగా ఉన్న సందర్భాలు లేవు. అతని గురించి జ్ఞాపకాలు, అంత గొప్పవేమీ కాదు. నిజానికి మాలతికి సంబంధించినంతవరకూ, అతనో, ఒక బలమైన శత్రువు. జ్ఞాపకాల్లోంచి, అతనిప్పుడు పునరుజ్జీవిస్తూ

మాలతికి, కొద్దిగా మేకప్ చేస్తున్నారు. "ఇంత సోఫిస్టికేషన్ అవసరం లేదు. నా కేరెక్టరుకు ఇంత మేకప్ నప్పదు," అంది డైరెక్టర్ తో. సన్నివేశాన్ని వివరిస్తున్నాడతను. సత్యప్రకాశం లోపలికి వస్తుండగా, అతనికి ఎదురెళ్ళి పలకరించి, ఇద్దరి మధ్య ఒక సంభాషణ. మరో సన్నివేశంలో, అతని విద్యార్థి జీవితపు జ్ఞాపకాలు, ఇంటర్వ్యూలాగా మాలతి మౌనంగా వింటుంది. ఎందుకో, అక్కడ నుంచి పారిపోవాలని అనిపించింది. సత్యప్రకాశానికి, 'నో' చెప్పి ఉండాల్సింది అనుకుంది.

విశాలమైన రెస్టారెంటులో ఒక మూలన ఖాళీగా ఒంటరిగా; మాలతి. చుట్టూ, సత్యప్రకాశం గురించిన వందలాది జ్ఞాపకాలు, కోపం, ద్వేషం, అసహనం, అయిష్టం, కానీ ఒక వింత ఉద్వేగం, ఆమెను కట్టిపడేస్తూ. కిటికీ పక్కన బల్ల ఖాళీగా ఉంది. అతిథుల కోసం ఎదురుచూస్తున్నట్లుగా. పొద్దున ఫోన్లో, మినర్వాలో షూటింగ్‌కి రమ్మని ఆహ్వానించి, చివర్లో, "మనం మళ్ళీ కొత్త స్నేహాన్ని, ఇంటిమసీని ఎందుకు మొదలుపెట్టకూడదు," అన్నాడు సత్యప్రకాశం. అతని గొంతులో ఆమె ఒప్పుకుంటుందనే ధీమా. మాలతి ఏం మాట్లాడలేదు. గట్టిగా నిట్టూర్చి ఫోన్ పెట్టేసింది.

సత్యప్రకాశం వచ్చాడు. కొత్తగా ఉన్నాడు. ఖరీదైన సత్య ప్రకాశం. రంగుల చొక్కా, మెడలో బంగారు గొలుసు, పక్కన నలుగురు అసిస్టెంట్లు మాలతి వైపు చూసి, "ఓహ్... మై ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ అండ్ మై హీరోయిన్," అన్నాడు సినిమాల్లోల్లాగా చేతులు వెడల్పుగా సాచి. మాలతి గంభీరంగా చూస్తుంది. ముఖంలో ఏమాత్రం ఉద్వేగాన్ని చూపకుండా. సన్నటి నవ్వుతో 'హలో,' చెప్పింది.

లైట్లు వెలిగాయి, కెమెరా ఫ్రేమ్ సెట్ అయ్యింది. డైరెక్టర్ వంశీకృష్ణ ఎగ్జైటింగ్‌గా ఉన్నాడు. "రడీ రోల్ ఆన్," అన్నాడు. కెమెరా, అద్దాల కిటికీ వైపు, కిటికీ అవతల రోడ్డుపై, రోడ్డుపై పరుగులా నడుస్తున్న జనం వైపు ఫోకస్ అయ్యింది.

కెమెరా మాలతి వైపు ఫోకస్ అయ్యింది. 'స్టార్ట్' అంటూ మాలతి వైపు సైగ చేశాడు డైరెక్టరు.

'ఓడిపోయి, యుద్ధం నుంచి పారిపోయి వచ్చిన కమాండర్ ఈ సత్యప్రకాశం. హి ఈజ్ మై డియరెస్ట్ ఎనిమీ. అయితే అతనంటే నాకు ద్వేషం లేదు. జాలి. ఒట్టి జాలి. కొత్త సమాజానికి నిర్మాత కావలసినవాడు, తన ఆత్మహత్యల్ని సినిమాలుగా తీసుకుంటూ ఐ పిటీ హిమ్. జాలి గొలిపే వస్తువులన్నా, మనుషులన్నా నాకసహ్యం," అంటూ అక్కడ నుంచి, వెళ్ళిపోయింది మాలతి. జిగేలుమంటున్న ఫోకస్ లైట్ వెలుగులో, ఆమె ఒక అదృశ్యమవుతున్న స్వప్నంలా తళు క్కుమంది.

## 3

మార్చి నెల మధ్యాహ్నం. మినర్వా కాఫీ హౌస్ నిశ్శబ్దంగా, ఖాళీగా ఉంది. కొత్తగా, అపరిచితుని కౌగిలిలా ఉంది. హోటల్ బయట బొకే షాపులో నాలుగు పసుపురంగు డాలియా పూలు కొనుక్కుంది, వీర. వాసన లేని క్రోటన్ జాతి పువ్వులవి. విశాలంగా, విప్పారి కనువిందు చేస్తున్నాయి.





షూటింగ్ ఉంది, నాలుగు గంటలకు రమ్మని ఫోన్ చేశాడు, వంశీకృష్ణ అనే డైరెక్టరు. వీరకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. 'టు హెల్ విత్ దట్ బగ్గర్,' అంది అమ్మ కరుణ. 'నువ్వు వెళ్ళనవసరం లేదు,' అని వీరకు సలహా యిచ్చింది. కానీ వీర, సత్యప్రకాశాన్ని కలవాలనే నిర్ణయించుకొంది. షూటింగ్ టైముకు చాలా ముందే వచ్చింది. ''షూటింగ్ ముందు నేనాయన్ని కలవాలి, మాట్లాడాలి, ప్లీజ్, ఆయనకు చెప్పండి. నేను రెండు గంటలకే మినర్వాకు వస్తాను,'' అని రిక్వెస్టు చేసింది.

మార్చి నెల ఎండపొడ. ఆమె చుట్టూ వెండి కవచంలా, సూర్యుడు ఆమె శరీరాన్ని మృదువుగా స్పృశిస్తూ, 'ఇవాళ్టి నా ఇనిస్పిరేషన్ సూర్యుడు. సఖుడా నువ్వు నా గృహానివి, నా యుద్ధ భూమివి, నా మరణానివి, రా... దగ్గరగా, ఇంకా దగ్గరగా,' అను కుంటూ, ఎండను దాటుకుంటూ హోటల్‌లోకి నడిచింది వీర.

నిండైన, ఒత్తైన జుట్టుతో, తలపై సముద్రాన్ని ధరించిన ఆ వీర ఇప్పుడు లేదు. ట్రీట్‌మెంటు కారణంగా, వీర జుట్టంతా ఊడిపో యింది. బంగారు రంగు విగ్ పెట్టుకొని, అద్దంలో చూసుకొని, 'ఇవాళ నేను కలర్ ఆఫ్ హోప్,' అనుకొంది. పర్సులో, మరో నల్లరంగు విగ్ కూడా పెట్టుకుంది.

వీర చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోయారు. అతనో విప్లవ నాయకుడని మాత్రం తెలుసు. ఆయనంటే వాళ్ళమ్మకు తీవ్రమైన ద్వేషం. ఇంట్లో అతని జ్ఞాపకాల ఆనవాళ్ళు ఏం లేకుండా చేసింది. వీరకు గుర్తున్నంతలో, వాళ్ళ నాన్న, చుట్టూ పదిమంది మనుషులతో, తీవ్రంగా వాదిస్తూ, చర్చిస్తూ ఉండటము గుర్తుంది. ఇంట్లో, విప్లవగీతాలు ప్రాక్టీసు చేసేవాళ్ళు, చాలామంది కుర్రాళ్ళు వాళ్ళతో కలిసి, ఎలుగెత్తి ఆయన కూడా పాడేవాడు. గాయకుడి గొంతు ఆయనది. ఆ గొంతులో మార్దవం, తీవ్రత రెండూ ఉండేవి. అంత

వరకే అతను గుర్తుకొస్తున్నాడు. ప్రేమగా, ఇష్టంగా అతనితో గడిపిన క్షణాలేమీ గుర్తుకు రాలేదు. అతను సినిమా డైరెక్టర్ అని చెప్పింది పెద్దమ్మ. థియేటర్ ఎక్కడో కనుక్కొని, ఆ సినిమాకు వెళ్ళింది. టెర్రిబుల్ బోర్. అతని ఫోటోలు పేపర్లో చాలాసార్లు చూసింది. హాండ్‌సమ్ ఫెలో. పొడవుగా, బెంగాలీల్లా లాల్చీ, పైజమా, గుబురు గడ్డం, ఫిలిమ్‌స్టార్‌లా ఉంటాడు, అనుకుంది వీర.

కాఫీహౌస్ ఖాళాగా ఉంది. ఒక మూలన కూర్చుంది వీర. తండ్రి కోసం ఎదురుచూస్తుంది. అతన్ని చూడగానే ఎట్లా రియాక్ట్ కావాలి, ఏం మాట్లాడాలి, అతన్ని ఏమని పిలవాలి, 'డాడీ' అనా, 'సర్' అనా? సినిమాల్లోలాగా పెద్దగా ఏడ్చి, 'ఎందుకిలా చేశావు నాన్నా,' అంటూ, పెద్దగా నవ్వుకుంది వీర.

వీర కళ్ళ ముందు స్లోమోషన్‌లో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొచ్చీ గుర్తు రానట్లు. ఇంటి ముందు రావిచెట్టు. దానిపై అటూ ఇటూ పరిగెత్తే ఉడతలు. పొద్దున్నే చెట్టుపైన మూగి, వందలాది పక్షుల అరుపులు (కూయింగ్...), రాగిచెట్టు మొదట్లో కూర్చుని, స్టీల్ గ్లాస్‌లో కాఫీ తాగుతూ అతను, ఒక అర్ధరాత్రి ఆ చెట్టు మొదట్లోనే కూలబడి, అమ్మ పెద్దపెద్దగా ఏడుస్తూ, అతను తాగి ఉన్నాడు, పెద్దపెద్దగా అరుస్తున్నాడు ఇంకో సాయంకాలం, ఆ రాగి చెట్టు మానుకు ఆను కొని, తనను దగ్గరకు తీసుకొని, పెద్దగా ఏడుస్తూ, అమ్మ, తన దగ్గర, భయంకర వాసన ఏదో వేస్తుంది. అమ్మ చనిపోవాలని ఎండ్రిన్ తాగింది అమ్మను భుజంపై వేసుకొని పార్టీ కార్యకర్తలు హాస్పటల్ వైపు పరిగెత్తటం, వీర కళ్ళలో నీళ్ళు తిరిగాయి. హోటలంతా రాగి ఆకుల గలగల, అమ్మ దుఃఖపు వాసన వేశాయి.

మిస్టర్ సత్యప్రకాశం ఇంకా రాలేదు. ఇప్పుడీ సత్యప్రకాశం గురించి ఏం చెప్పాలి. "మై బయొలాజికల్ ఫాదర్, దట్సాల్" అని చెప్పాలా. "ది విలన్ ఇన్ మై లైఫ్" అని చెప్పాలా. వీర గాఢంగా





నిట్టూర్చింది. వీర, కాఫీ ఆర్డర్ చేసింది. కాఫీ తాగుతూ, టేబుల్‌పై నున్న డాలియా పూల వైపు చూసింది. అవి లోగొంతుకతో పూర్ణతో మాట్లాడుతున్నట్లుగా ఉన్నాయి.

ఉదయాన్నే, తల్లితో కలిసి గుడికి వెళ్ళింది వీర. మృత్యుం జయ మంత్రమేదో చదివి, నుదుటిని విభూతి అద్ది, ‘‘ఇకంతా జయం, మరణం నిన్ను అంటదు,’’ అన్నాడు పూజారి. వీరకి భక్తి, భగవంతుడి మీద గురి లేదు. ఇన్నాళ్ళు దేవుడు లేకుండానే పెరిగింది. వారం రోజుల క్రితం, ఎప్పుడూ వేసుకునే మందులతోపాటు (కీమో) రెండు నిద్రమాత్రలు కూడా వేసుకున్నాక, నిద్రపోయే ముందు, వీరకు, భగవంతుడు కనబడ్డాడు. తెల్లటి జుట్టు, నీలిరంగు శరీరం, ఆయన ముఖం అలసటగా ఉంది. ఆయన వెనుక, దూరంగా ఎక్కడినుంచో నినాదాల హోరు. గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకంగా, స్త్రీలకూ, దళితులకూ సమాన హక్కులు కావాలని, టీనేజ్ అబార్షన్ల గురించి, లివింగ్ ఇన్ రిలేషన్ గురించి, అకాల మరణాల గురించి, నినాదాలు వినిపిస్తు న్నాయి.

దేవుణ్ణి ముట్టుకోవాలనిపించింది పూర్ణకు. అతని గొంతు వినా లని, అతన్ని గట్టిగా కౌగిలించుకోవాలని కోరిక కరిగింది. దేవుడి ఇల్లు ఎక్కడో తెలుసుకోవాలనిపించింది. నిద్రమత్తు వదిలించుకొని, డ్రాయింగ్ రూమ్‌కు వెళ్ళి, కాస్త మేకప్ చేసుకోవాలని, విగ్గును పెట్టు కొని, రొమాంటిక్‌గా ఆయనకు కనబడాలని అనిపించింది. దేవుడు చాలాసేపు ఆమె గదిలో ఉన్నాడు. అదంతా ఆమెకిప్పుడు గుర్తులేదు, గానీ ‘‘దేవుడు బాగా పెద్దవాడయి పోయాడు, పాపం,’’ అని ఆమె అనుకున్న మాటలు మాత్రం ఇంకా గుర్తున్నాయి వీరకు.

సత్యప్రకాశం ఇంకా రాలేదు. ఇంకో కాఫీ ఆర్డర్ చేసింది. పక్కనున్న కిటికీ అద్దంలోంచి, ఎవరో అమ్మాయి వీర వైపు చూస్తూ, ఉలిక్కిపడింది వీర. అది తనే. చర్మం వడలిపోయి, ముడతలు పడి, పూలకొమ్మలా మృదువైన ఆ పూర్ణ ఎక్కడ?

'యూ ఆర్ సో బ్యూటిఫుల్,'' ఎవరో ఆమె చెవి దగ్గర గుస గుసలాడుతున్నారు. మోహన్, ఆమె బాయ్ ఫ్రెండ్. ఇందిరాపార్కు చెట్ల గుబుర్లచాటున, వీర లేత శరీరం. పియానోలా మారి, అతని చేతి వేళ్ళు, ఆమె శరీరాన్ని స్పృశిస్తుంటే, మెడపై అతని పెదాలు, అతనో గొప్ప సంగీత విద్వాంసుడిలా మారి, వీర, పెదాలు, ముక్కు, కనుబొమ్మలు, నుదురు, చెంపలు, చెవులు, మెడ, వీపు, స్తనాలు, పొట్ట, నడుము, పిరుదులు, మోకాళ్ళు, పాదాలు, సమస్తం, అతని స్పర్శలో తడిచి;

వీర, వడిలిపోయిన చేతుల్తో, తన శరీరభాగాలన్నీ తడుము కుంది. కళ్ళ ముందో మాయా అద్దం మొలిచి, హఠాత్తుగా పెద్దగా ఏడ్చింది వీర.

హోటల్ గేటు దగ్గర సత్యప్రకాశం. వీర కళ్ళు తుడుచుకుంది. కొద్దిగా టెన్షన్‌పడింది. లేచి, నిలబడి, పూలగుత్తిని అతనికి అందించి;

సత్యప్రకాశం, వీరను దగ్గరకు లాక్కుని, గట్టిగా కౌగిలించు కొని; వీరకు ఏడుపు వచ్చింది. పెద్దగా తట్టుకోలేనట్లుగా ఏడ్చింది. ఆశ్చర్యంగా సత్యప్రకాశం కళ్ళలో నీళ్ళు.

వీర, సత్యప్రకాశం వైపే చూస్తుంది. చెంపలపై తెల్ల వెంట్రు కలు. ఇతనూ పెద్దవాడయిపోయాడు అనుకుంది. ''మొన్న భగ వంతుణ్ణి చూశాను. కొంచెం నీ పోలికలున్నాయి, ఆయనకు,'' అని చెబుదామనుకుంది.

సత్యప్రకాశం, ఇంకా దుఃఖపు మూడ్‌లో ఉన్నాడు.

కర్చీఫ్‌తో కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్నాడు. గొంతు పెకల నట్లుగా 'హౌ ఆర్ యు మై చైల్డ్'' అన్నాడు. ''ఊ'' అంది కొద్దిగా తేరుకొని, ముఖంపై నవ్వులు పూయిస్తూ.

వీరకెంతో తృప్తిగా ఉంది. వీర హైదరాబాద్‌ను క్షమించింది. డాక్టర్లను, హాస్పటల్స్‌ను క్షమించింది. సత్యప్రకాశం (నాన్న) మీద





కోపం పోయింది. హాండ్ బ్యాగ్‌లోంచి నల్లరంగు విగ్గును తీసి పెట్టు కొంది. "ఐష్‌లా ఉన్నాను కదూ" అంది సన్నగా నవ్వుతూ. సత్య ప్రకాశం ముఖంలో సన్నటి నవ్వు మెరిసింది.

వీర చేతుల్ని, తన చేతుల్లోకి తీసుకొని ప్రేమగా నిమరసాగాడు సత్యప్రకాశం. అతనివైపు చూస్తూ, ఒక దృశ్యరూపకంలోకి వెళ్ళి పోయింది వీర. మనుషులు, మేడలు, పేవ్‌మెంట్ల పైని టీ షాపులు, అద్దాల్లోంచి మెరిసే పూలగుత్తులు, కువకువలాడే పావురాలు, చౌరస్తాల దగ్గర అడుక్కునే పిల్లలు, టాంక్‌బండ్‌పైన విగ్రహాలు, వాటి మెడల్లో ఎండిపోయిన ఎప్పటివో దండలు, చాక్‌లెట్లు, కాఫీడేలో వెచ్చని కాఫీ, చాటుగా పెట్టుకొన్న ముద్దు, ఎన్నో గుర్తుకొచ్చాయి. వీర కెందుకో చాలా ధైర్యంగా, ఉత్సాహంగా అనిపించింది.

వీర, వీర, ఒకే ఒక్క వీర, చెదరని బెదరని వీర, మరణాన్ని జయించగల వీర, భగవంతుని చూసిన వీర, నిశ్శబ్దంగా, ఇష్టంగా, సత్యప్రకాశం వైపు చూస్తూ...

అప్పుడే సినిమా క్రూ, హోటల్‌లోకి అడుగు పెట్టారు. లైట్లు, కెమెరాలు ఫిక్స్ చేసుకుంటూ

ఒక హడావుడి మళ్ళీ మొదలైంది.

*పాలపిట్ట, జూన్ 2011*